## ఖర్జూరా మొక్కలు నాటిన జిల్లా ఎక్సైజ్ అధికారి

**కొడంగల్, అక్టోబర్ 31ప్రభాతవార్త**

మండల పరిధిలోని పెద్ద నందిగామ గ్రామంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నవీన్‌చంద్ర ఖర్జురా మొక్కలను నాటారు. సోమవారం పెద్దనందిగామ గ్రామంలో టీకెహెచ్‌హెచ్ కార్యక్రమంలో భాగంగా 600 ఖర్జురా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సైదులు, ఎస్సై శ్రవన్‌కుమార్‌లతో పాటు గ్రామ టీసీఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఖర్జురా మొక్కలను నాటుతున్న జిల్లా ఎక్సైజ్ అధికారి

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## తాండూరులో 12మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.45,220 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం

**తాండూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త:** తాండూరు పట్టణంలో పేకాట ఆడుతున్న 12మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని పట్టణ ఎస్ఐ వేణుగౌడ్ తెలిపారు. తాండూరు పట్టణంలో రెండు వేరు వేరు చోట్ల పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సోమవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 12మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 45220 నగదు, పేకాట ముక్కలను స్వాదీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. పట్టణంలోని గొల్ల చెరువు వెనుకాల ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేయగా తాండూరు పట్టణానికి చెందిన ఎండీ వసీయుద్దీన్, అత్తర్, రాథోడ్ మహేష్, అబ్దుల్ ఖదీర్, పెద్దెముల్ ప్రశాంత్‌కుమార్, మద్ది కంటి రవీందర్, బాబాలు పేకాట ఆడుతుండగా వారిని అదుపులోకి తీసుకొని రూ.28080 నగదు స్వాదీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అదేవిదంగా పట్టణంలోని బృందావన్ కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న పట్టణానికి చెందిన రవికుమార్, లక్ష్మీకాంత్, శ్రీకాంత్, కావలి సుధాకర్, దనాల వెంకట్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 17200 నగదు స్వాదీనం చేసుకోవడం జరిగిందని, 12మందిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ వేణుగౌడ్ వెల్లడించారు.

## ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



ఘణాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మహేశ్‌గౌడ్ తదితరులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 31, ప్రభాతవార్త:**

మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేద ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద సోమవారం మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధ్ర 38వ వర్ధంతిని నిర్వహించారు. ఘణాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల రాజుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహేశ్‌గౌడ్ విచ్చేసి మాట్లాడారు. ఈసందర్భంగా నాయకులు ఇందిరాగేంధీ చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. ఇందిరాగాంధీ తొలిమహిళా ప్రధానమంత్రిగా పేదరిక నిర్మూలనకు కృషి చేశారని కొనియాడారు. గతంలో దివంగత సీఎం వైఎస్ఆర్ ప్రభుత్వ హయాంలో ఇందిరాగాంధీ పేరుతో ఇందిరమ్మఇళ్లు, ఇందిరాక్రాంతిపథకం వంటి సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ వేముల పరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ నానావత్ రూప్‌సింగ్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ వేముల సత్తయ్యగౌడ్, వార్డుసభ్యులు చిలుగూరి భాస్కర్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు బోనకూర్తి నరేందర్, టిఎస్ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేముల గోవర్ధన్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు వేముల శంకర్‌గౌడ్, గౌడ సంఘం మాజీ అధ్యక్షులు తాటికొండ మల్లేశ్‌గౌడ్, మండల ఎన్ఎస్‌యుఐ నానావత్ శివాజీనాయక్, గ్రామ అధ్యక్షులు వేముల అభిలాష్‌గౌడ్, నేతాజీ యూత్ సభ్యులు వికాస్‌గౌడ్, మనోజ్‌గౌడ్, మణిశరణ్‌గౌడ్, చాణిక్యగౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట నిర్మాణ రంగ కార్మికుల ధర్నా

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 31, ప్రభాతవార్త**

భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం (బిఎన్ఆర్‌కెఎస్) నాయకులు, కార్మికులు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం (బిఎన్ఆర్‌కెఎస్) నాయకులు, కార్మికులు చేరుకుని సమస్యలను పరిష్కరించాలంటూ ధర్నా చేసి ఆందోళన వ్యక్తం చేశారు. మీ సేవ సభ్యత్వం రద్దు, వృద్దాప్య ఫెన్షన్, బోగస్ కార్డులు రద్దు, వెల్ఫేర్‌బోర్డు కమిటీ వేయటం గురించి ప్రభుత్వం స్పందించాలని ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# భారత్ జోడో యాత్రకు అడుగడుగున ఘన స్వాగతం

- వేలాది మందితో రాహుల్ గాంధీ పాదయాత్ర - షాద్‌నగర్, నందిగామ, కొత్తూరు మీదుగా కొనసాగింపు



షాద్‌నగర్‌లో కొనసాగుతున్న పాదయాత్ర



యాత్రకు తరలి వచ్చిన జనం.



రాహుల్, రేవంత్‌రెడ్డిల వెంట పాదయాత్ర చేస్తున్న వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, అక్టోబర్ 31, (ప్రభాతవార్త) :**

కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్రకు షాద్‌నగర్ నియోజకవర్గంలో విశేష స్పందన వచ్చింది. అడుగడుగునా రాహుల్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, ప్రజలు నీరాజనాలు పలికారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ఉదయం 6 గంటలకే రాహుల్ పాదయాత్ర ప్రారంభించారు. షాద్‌నగర్ ముఖ్యకూడలీ నుంచి ప్రారంభమైన రాహుల్ పాదయాత్ర లింగారెడ్డిగూడ, చంద్రాయణగూడ, నందిగామ, కొత్తూరు మీదుగా పాదయాత్ర కొనసాగించారు. రాహుల్ గాంధీ పాదయాత్రలో పాల్గొనడానికి వేలాది మంది ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావడంతో పాత జాతీయ రహదారిపై సుమారు మూడు కిలోమీటర్ల వరకు కాంగ్రెస్ శ్రేణులు నిండిపోయారు. షాద్‌నగర్ నుంచి ప్రారంభమైన పాదయాత్రలో రాహుల్ గాంధీ వెంటే షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వీర్లపల్లి శంకర్ నడిచారు. ఈ యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, చల్ల వంశీచంద్‌రెడ్డి, కొండా సురేఖ తదితర అగ్ర నాయకులు సహితం రాహుల్ గాంధీ పాదయాత్రలో భాగస్వాములై ఆయన వెంటన నడిచారు. ప్రతి ఊరిలో రాహుల్‌కు ఘన స్వాగతం ఏర్పాటు చేసి బాణసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

**భారీగా తరలి వచ్చిన జనం...**

షాద్‌నగర్ నియోజకవర్గంలో జరుగుతున్న భారత్ జోడో యాత్రకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు సుమారు 30వేలకు పైగా తరలి వచ్చారు. యాత్రకు వచ్చిన ప్రతి ఒక్కరికి షాద్‌నగర్ నియోజకవర్గ ఇంఛార్జ్ వీర్లపల్లి భోజనాలు ఏర్పాటు చేశారు. యాత్రలో ఎవరికి ఏలాంటి ఇబ్బందులు కగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని నందిగామ, కొత్తూరు తదితర ప్రాంతల్లో భోజన సదుపాయాలను ఏర్పాటు చేయించారు.

**కొత్తూరులో విశ్రాంతి...**

షాద్‌నగర్ పట్టణం నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరిన రాహుల్ గాంధీ లింగారెడ్డిగూడ, చంద్రాయన్‌గూడ, నందిగామల మీదుగా కొనసాగిన పాదయాత్ర 10.30 గంటలకు కొత్తూరుకు చేరుకుంది. అనంతరం కొత్తూరులోని ఓ రిసార్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన విరామం తరువాత 2 గంటల వరకు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని సుమారు 45 నిమిషాల పాటు విలేకరులతో ముచ్చటించారు. ఈ సమావేశంలో పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలుపుతూ తెలంగాణ రాజకీయాలపై హట్ కామెంట్లు చేశారు. అనంతరం 4 గంటలకు తిరిగి పాదయాత్ర ప్రారంభించి అక్కడి నుంచి తిమ్మాపూర్ మీదుగా శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్‌కు యాత్రను కొనసాగించారు. తెలంగాణ రాష్ట్రంలో 6వ రోజు కొనసాగుతున్న ఈ పాదయాత్ర సుమారు 28 కిలో మీటర్లు కొనసాగునున్నట్లు కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు. రాత్రి బస తొండుపల్లి వద్ద చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి

-జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహా రెడ్డి

-కలెక్టరేట్ ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన 55 వినతులు,ధరఖాస్తులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 31, ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగ కలెక్టరేట్ ప్రజావాణిలో వచ్చిన వినతులు, ఫిర్యాదులు,ధరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ జాన్‌శ్యాంసన్ లు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా నూతనకలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా వ్యాప్తంగ ప్రజల నుంచి 55వినతులు, ఫిర్యాదులు, దరఖాస్తులు అందినట్లు వారు తెలిపారు. ప్రజల నుంచి అందిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లా పరిధిలోని ఎఎస్‌రావునగర్ కాలనీ సొసైటీ కమిటీ వారు ఇంజనీర్ల సలహాలు తీసుకోకుండా అనాలోచిత నిర్ణయాలతో మరో ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు, వాటర్ సప్లయి లైన్లు వేయటానికి విచ్చలవిడిగా లక్షల రూపాయలు ఖర్చుచేయటానికి కమిటీ వారు నిర్ణయించటంపై విచారణకు, నిధుల కట్టడికి చర్యలు తీసుకోవాలని, ఉన్న నిధులు దుర్వినియోగం కాకుండ తగు విచారణ జరిపించి సొసైటీ నిధులు కాపాడాలని జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డిని, జాన్‌శ్యాంసన్‌లను ప్రజావాణి కార్యక్రమంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని ఏఎస్‌రావు నగర్ కాలనీలో డా.ఎఎస్‌రావు చొరవతో 1976సంవత్సరంలో ఈసిఐఎల్ ఎంప్లాయిస్ కోఆపరేటీవ్ హౌజింగ్ కన్సస్ట్రక్షన్స్ సొసైటీ ఏర్పడిందన్నారు. అయితే 117ఎకరాల భూమిని కొనుగోలు చేసి 1077 ప్లాట్లు చేసి ఈసిఐఎల్,ఎన్ఎఫ్‌సి ఉద్యోగులను సభ్యులుగా చేర్చుకుని ప్లాట్లు చేసి లక్కిడిప్ పద్దతి ద్వారా కేటాయించటం జరిగిందని, ముందుగా పైప్‌లైన్లు సరిగ్గా చేయాల్సి ఉందని ఇదీ లేకుండా ఎన్ని సంపులు,ట్యాంకులు కట్టినా ఉపయోగం ఉండదని వారు వివరించారు. వృదా ఖర్చులను కట్టడి చేయాలని ఆ కాలనీ ఉమ్మడి సొసైటీ, ఉమ్మడి వేధిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డిని కలెక్టరేట్ ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా డిసిఓ ద్వారా విచారణ జరిపి నిధులు వృధాగ ఖర్చు చేయకుండ సొసైటీ సభ్యుల సూచనల మేరకు పనులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్లను కలిసిన వారిలో సభ్యులు ఎఎస్‌రావునగర్ కాలనీ సొసైటీ ఉమ్మడి వేధిక కమిటీ ప్రతినిధులు టి.శ్రీనివాస్, ఎ.రాజమల్లు, ఎ.వీరారెడ్డి, కె.సోమయ్యచారి, ఎం.బసవేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు. అదే విధంగా శామీర్‌పేట గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 1218గల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యాక్రాంతం కాకుండ తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు, శామీర్‌పేట గ్రామ కోఆప్షన్ మెంబర్ మ్యాకల మహేందర్‌యాదవ్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకుంటామని వారు చెప్పినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగ పలువురు పలు సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదులు చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్‌ఓ లింగ్యానాయక్, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డికి వినతిపత్రం అందజేసిన ఎఎస్‌రావు నగర్ కాలనీ సొసైటీ ఉమ్మడి వేధిక కమిటీ ప్రతినిధులు,కాలనీవాసుల దృశ్యం

## బాలుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

-డబ్బు కోసమే బాలుడి దారుణ హత్య

-నిందితుడి అరెస్టు..కేసుపై సమగ్ర దర్యాప్తు : జిల్లా ఎస్పీ కోటిరెడ్డి



బాలుడి హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

**కొడంగల్, అక్టోబర్ 31ప్రభాతవార్త**

అభం శుభం తెలియని బాలుడి కిడ్నాప్,హత్య కేసును పోలీసులు 24 గంటల్లోపే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. కొడంగల్ ప్రాతంలో సంచలనం రేపిన కేసుకు సంభందించి జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి సోమవారం కొడంగల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కొడంగల్ పట్టణంలోని మిట్టిబౌలి ప్రాంతానికి చెందిన ఇదాయతుల్లాఖాన్ కుమారుడు రజాఖాన్(11) ఈనెల 29 శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని అతని సైకిల్ అదే కాలనీలోని మిట్టిబౌలి దగ్గర పడి ఉందని మృతుడు రజాఖాన్ పెద్ద నాయన ఫిర్యాదు మేరకు కేసు నమోదుతో దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. కేసు నమోదుతో పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కొడంగల్ సీఐ శంకర్ ఎస్సై రవిగౌడ్‌లతో పాటు జిల్లా డీఎస్ఆర్,సీసీఎస్ సీఐలు సమగ్ర దర్యాప్తు చేపట్టడం జరగిందన్నారు. ఆదివారం కొంతమంది రజాఖాన్ అంబేద్కర్ కాలనీలో రజాఖాన్‌ను అదే కాలనీకి చెందిన అజయ్ అనే వ్యక్తి తన స్కూటీపై తీసుకువెళ్ళడం చూశానని చెప్పడంతో ఆదివారం రాత్రి అజయ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా రూ.25లక్షలు ఈజీగా వస్తాయనే దురాశతో బాలుడు రజాఖాన్‌ను కిడ్నప్ చేసి హత్య చేసినట్లు నేరం అంగీకరించడం జరిగిందన్నారు. నిందితుడు అజయ్ జులాయిగా తిరిగేవాడని ఈజీగా డబ్బులు సంపాదించాలనే దురాశతో డబ్బున్న వారిని ఎంచుకొని వారి పిల్లలను కిడ్నప్ చేయాలనే పథకం పన్నాడు. ఈ క్రమంలో నిందితుడి ఇంటికి కొద్ది దూరంలో ఉన్న అజ్మతుల్లాఖాన్ ఇంటికి వెళ్ళి రావడంతో పాటు వారి కట్టెల మిషన్‌కకు వెళ్ళి వచ్చేవాడు. ఈ క్రమంలో వీళ్ళూ బాగా డబ్బులు ఉన్న వాళ్ళు అని వీరి కుటుంబం నుంచి డబ్బులు రాబట్టాలని పథకం వేసి అజ్మతుల్లా ఖాన్ కుమారుడు రాజాఖాన్‌ను కిడ్నప్ చేయాలని ఆ బాలుడిని రోజు తన దగ్గరకు పిలిపించుకొని చాక్లెట్‌లు లాంటివి ఇచ్చి దగ్గర కావాలని ప్రయత్నం చేశాడు. అదును చూసుకొని శనివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో రాజాఖాన్‌ను కిడ్నప్ చేసి తన ఇంటికి తీసుకువెళ్ళి నువ్వు సైలెంట్‌గా ఉండాలి నేను మీ వాళ్ళకు డబ్బులు కావాలని బెదిరించడంతో భయపడిన రాజాఖాన్ గట్టిగా అరవడంతో కోపంతో అజయ్ రాజాఖాన్‌ను పట్టుకొని ఇనుప సుత్తితో కంతలు,తలపై గట్టిగా కొట్టడంతో రాజాఖాన్ మృతిచెందినట్లు పేర్కొన్నారు. రాజాఖాన్ చనిపోవడంతో ఇంట్లో పడిన రక్తపు మరకలను కడిగి తల్లిదండ్రులకు అనుమానం రాకుండా శవాన్ని సూట్‌కేసులో పెట్టి పట్టణ శివారులోని ఎస్సీ వసతి గృహం పక్కనే గల నీటి గుంతలో పారవేసినట్లు తెలిపారు. కాగా నిందితుడు అజయ్ గతంలో హైద్రాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో చదువుకుంటూ ఉద్యోగం చేసే క్రమంలో వారి ఇంటి యజమాని ఇంటిలో రూ.25లక్షలు దొంగిలించగా అట్టి కేసులో దొరికి కోర్టుకు హాజరవుతు తన నేర జీవితాన్ని ప్రారంబించాడని తెలిపారు. సుమారు మూడు సంవత్సరాల అనంతరం ప్రస్తుతం తన నేర పూరితమైన ఆలోచనలను మళ్ళీ మొదలు పెట్టి బాలుడు రజాఖాన్ హత్యకు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిపై కిడ్నప్,హత్య కేసు నమోదుతో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కేసుకు సంభందించి మరింత లోతైన విచారణ జరిపి నిందితులు ఎవరైనా వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇకముందు ఎక్కడైనా నేర చరిత్ర గల వారు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే కేసును ఛేదించడంలో కృషి చేసిన డీఎస్పీ, సీఐ,ఎస్సైలను ఎస్పీ అభినందించారు. సమావేశంలో పరిగి,తాండూర్ డీఎస్పీలు శేఖర్‌గౌడ్,కరుణాసాగర్ రెడ్డి,సీఐ శంకర్‌లతో పాటు ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్సైలు రవిగౌడ్,రమేష్,నయ్యూం తదితరులున్నారు.

# కబ్జా అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడండి

-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

-అధికారులు స్పందించకుంటే సిపిఐ పోరాటాలు తప్పవు

-కలెక్టరేట్ వద్ద జరిగిన సిపిఐ నాయకుల ధర్నా



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన సిపిఐ ధర్నాలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎన్.బాలమల్లేశ్, జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి.సాయిలుగౌడ్, పలువురు నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 31, ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగ కబ్జాలు అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని, ఆ భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలోని సర్వేనెంబర్లు 342, 329గల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద మేడ్చల్ జిల్లా సిపిఐ సమితి, జిల్లా పార్టీ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు కబ్జాలు అవుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవరిస్తున్నారని విమర్శించారు. కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారం ప్రభుత్వ భూములకు సంబంధించి కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని దీని వల్లనే ప్రభుత్వ భూములు కబ్జాల పాలు అవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు ప్రభుత్వ భూములను కాపాడి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే మాత్రం ఆ ప్రభుత్వ భూములలో ఎర్రజెండాలు పాతి పేదలకు పంపిణీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడి అర్హులైన పేదలకు పంపిణీ చేసిన ఘనత సిపిఐకి ఉందని ఆయన స్పష్టం చేశారు. జిల్లా పాలనా రెవెన్యూ అధికారులు వెంటనే గాజులరామారం ప్రభుత్వ భూములను సందర్శించి కబ్జాదారులు అక్రమంగ నిర్మించిన ఇండ్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని డిమాండ్ చేశారు. కబ్జాలకు పాల్పడిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎన్.బాలమల్లేశ్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా వ్యాప్తంగ రానున్న రోజుల్లో ప్రభుత్వ భూములను కాపాడాలని భూపోరాటాలు చేస్తామని అన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడటానికి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు జి.దామోదర్‌రెడ్డి, ఈ.ఉమా మహేశ్, మున్సిపల్స్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎస్.శంకర్‌రావు, జి.లక్ష్మి, ఆర్.కృష్ణమూర్తి, హరనాథరావు, కె.స్వామి, వెంకట్‌రెడ్డి, వివిధ మండలాల కార్యదర్శిలు యాదయ్యగౌడ్, టి.రాములుగౌడ్, వెంకటాచారి, దుర్గయ్య, సహదేవ్, సల్మాన్. ఆర్.గిరిజ, కృష్ణ, సదానంద్, రామకృష్ణ, సాయిలు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సత్యప్రసాద్, పలు మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా తరువాత సిపిఐ నాయకుల బృందం కలెక్టరేట్‌లోని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి ఆయన స్పందించి కబ్జాలు చేసిన ఇండ్లను తొలగిస్తామన్నారు.

## శామీర్‌పేట పెద్ద చెరువులో ఛట్ పూజలు

**శామీర్‌పేట, అక్టోబరు 31, ప్రభాతవార్త**

శామీర్‌పేట పెద్ద చెరువుకు సోమవారం ఉదయం ఉత్తర భారతీయులు విచ్చేసి ఛట్ పూజలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉత్తర భారతీయులు ప్రతి ఏటా శామీర్‌పేట పెద్ద చెరువుకు విచ్చేసి ఛట్‌పూజలు చేయటం జరుగుతుంది. శామీర్‌పేట పెద్ద చెరువు ఒడ్డుపై పూజలు చేసి దీపాలు వెలిగించి గంగలో (నీటిలో) వదలటం జరిగింది. వారు సాంప్రదాయ బద్దంగ చెరువులో పలు కుటుంబాల వారు మహిళలు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించటం భక్తిపారవశ్యాన్ని తెలియజేస్తుంది. చెరువు ప్రాంగణం అంతా వారి కుటుంబ సభ్యులతో సందడిగా మారింది.



శామీర్‌పేట పెద్ద చెరువులో ఛట్‌పూజలు చేసిన ఉత్తర భారతీయుల దృశ్యం

## కలెక్టర్ హరీశ్‌ను కలిసిన టిజిఓస్ బేరర్స్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 31, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ (టిజిఓస్) అసోసిషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీనివాస్‌మూర్తి నియమితులయ్యారు. సోమవారం మేడ్చల్ జిల్లా టిజిఓస్ అసోసిషియేషన్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగ జిల్లా కమిటీలోకి నలుగురు కొత్త ఆఫీస్ బేరర్స్‌ను తీసుకున్నారు. దీనిలో జిల్లా టిజిఓస్ ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీనివాస్‌మూర్తి (డిసిఓ), ట్రెజరర్‌గా కె.వెంకటేశం, వైస్‌ప్రసిడెంట్‌గా జి.శ్రీనివాస్ (ఏఎస్ఓ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.కరుణాకర్‌లు నియమితులయ్యారు. దీనికి సంబంధించి జిల్లా అధ్యక్షులు కె.వినయ్‌కుమార్‌గౌడ్,ఉపాధ్యక్షులు ఎం.రాంచందర్, అసోసిషియేట్ ప్రసిడెంట్ జె.నర్సింలు సోమవారం ప్రకటించారు. జిల్లా కలెక్టరేట్‌లో సమావేశమైన జిల్లా టిజిఓస్ ఆఫీస్ బేరర్స్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరీశ్‌ను కలిసి జిల్లా అసోసిషియేషన్‌కు కేటాయించిన 9గుంటల స్థలంలో వెంటనే నిర్మాణంకు అనుమతి కోరటం జరిగిందని వారు తెలిపారు. దీనికి కలెక్టర్ సానుకూలంగ స్పందించినట్లు తెలిపారు.



జిల్లా కలెక్టర్ హరీశ్‌ను కలిసిన మేడ్చల్ జిల్లా టిజిఓస్ నాయకులు

## గుండ్లబావిలో బిజెపి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

-రాజ్‌గోపాల్‌రెడ్డికి మద్దతుగా ఎంపిపి



బిజెపి ర్యాలీలో పాల్గొన్న ఘట్‌కేసర్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, అక్టోబర్ 31, ప్రభాతవార్త:** మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కొమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డికి మద్దతుగా ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేశారు. మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ మండలం గుండ్లబావి గ్రామంలో బిజెపి ఆధ్వర్యంలో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. బూత్ ఇంచార్జ్‌గా ఎన్నికల ప్రచార బాధ్యతలు నిర్వహిస్తున్న ఘట్‌కేసర్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి గ్రామాల్లో ఓటర్లను కలుసుకొని అభ్యర్థి రాజ్‌గోపాల్‌రెడ్డిని గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్, మండల బిజెపి నాయకులు అభ్యర్థి కొమటిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నారు. ర్యాలీలో ఎంపిపి వెంట డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దింటి బుచ్చిరెడ్డి, బూత్ అధ్యక్షులు నందగిరి రమేశ్, నాయకులు, కార్యకర్తలు, యువకులు ఉత్సాహంగా బైక్‌ర్యాలీలో పాల్గొన్నారని ఎంపిపి తెలిపారు.

### పంచాయతీ కార్మికులకు దుస్తుల అందజేత



దుస్తువులు అందుకున్న పంచాయతీ కార్మికులు

**బషీరాబాద్, అక్టోబర్ 31, ప్రభాతవార్త:** దీపావళి పండగను పురస్కరించుకొని బషీరాబాద్ పంచాయతీ కార్మికులకు రఘు సూత్రవే దుస్తులను అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ తమ పట్ల ఆదరణ చూపి దుస్తులను అందించిన రఘుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యువజన సంఘం సభ్యులు, యువకులు తదితరులు ఉన్నారు.

### సహస్రార్జున్ జయంతి వేడుకలు

**బషీరాబాద్, అక్టోబర్ 31, ప్రభాతవార్త:** సోమవంశ క్షత్రియుల ఆరాధ్య గురువైన సహస్రార్జున్ జయంతి వేడుకలను సోమవారం నాడు బషీరాబాద్ మండల పరిధిలోని మైల్వార్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షత్రియులు అందరూ కలిసి మైల్వార్ ఎస్.ఎస్.కె భవనంలో సహస్రార్జున్ చిత్రపటానికి పూలమాల వేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.కె సమాజ్ మండల అధ్యక్షులు నారాయణ రావు, ప్రధాన కార్యదర్శి జగదీష్, కుల పెద్దలు దామోదర్, మోహన్, విఠల్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ జయంతి



. మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ జయంతి సందర్భంగ విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం, పాల్గొన్న ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, సర్పంచు ఎస్.మోహన్‌రెడ్డి, ఎంపిఓ సునిత, తదితరులు

**శామీర్‌పేట, అక్టోబరు 31, ప్రభాతవార్త**

సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని మజీద్‌పూర్‌లో సర్దార్‌వల్లబ్‌బాయ్ పటేల్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ సమగ్రత, ఐక్యత, భద్రతను కాపాడుతామంటూ నన్ను నేను అంకితం చేసుకుంటానని దేశ వ్యాప్తి చేస్తానని ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, మజీద్‌పూర్ సర్పంచు ఎస్.మోహన్‌రెడ్డి, ఎంపిఓ సునిత, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పగుడాల రాములు



**శంషాబాద్ అక్టోబర్31, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా శంషాబాద్‌కు చెందిన పగుడాల రాములు మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు విశ్వాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి సమక్షంలో జరిగిన ఎన్నికల్లో రాములు గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జగదీశ్వర్, కోశాధికారిగా టెలిశ్వరయ్య, అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మోహన్ రావు, జగన్మోహన్ రావు, సావిత్రి కార్యదర్శులుగా లక్ష్మీనరసింహ రావు, కోటిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శేఖరయ్య, పాపయ్య, సంయుక్త కార్యదర్శిగా కిషన్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా శ్రీరాములును ఎన్నుకున్నారు.

## సర్దార్ పటేల్‌కు నివాళి

**మేడ్చల్, అక్టోబర్ 31. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దొడ్డ మల్లికార్జున్ ముదిరాజ్, అమరం హేమంత్‌రెడ్డితో పాటు విష్ణువర్థన్‌రెడ్డి, మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



గుండ్లపోచంపల్లిలో సర్దార్ పటేల్ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న నేతలు

## దేశ ఐక్యతకు నిదర్శనం సర్దార్ వల్లభాయ్ పటేల్

-బిజెవైఎం అసెంబ్లీ కన్వీనర్ అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి



చేవెళ్లలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూల మాలలు వెసి నివాళులర్పిస్తున్న బిజెపి చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి ఆనంతరెడ్డి, బిజెవైఎం అసెంబ్లీ కన్వీనర్ అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి

**చేవెళ్ళ, అక్టోబర్ 31, ప్రభాతవార్త**

భారత దేశంను ఐక్యంగా ఉంచిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు మాత్రమే దక్కిందని, దేశ ఐక్యతకు నిదర్శనం సర్దార్ వల్లభాయ్ పటేల్ అని బిజెవైఎం అసెంబ్లీ కన్వీనర్ అల్లాడ శ్రీనివాస్‌రెడిడ్డి అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి బిజెపి చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి ఆనంతరెడ్డి అధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. అ సందర్భంగా బిజెవైఎం అసెంబ్లీ కన్వినర్ అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి సర్దార్ వల్లబాయ్ పటేల్ చేసిన సేవలు చీరస్మరణీయమని, ప్రతి ఒక్కరు ఆయనను అదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోని 500లకు పైగా సంస్థానాలను భారత్‌లో విలీనం కావడానికి పటేల్ చేసిన కృషి మరువరానిదన్నారు. అపరేషన్‌లో పోలో చేపట్టిన నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించారన్నారు. తెలంగాణ సమాజం ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు రుణపడి ఉందన్నారు. భారత ఉప ప్రధానిగా అయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. బిజెపి చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి ఆనంతరెడ్డి మాట్లాడుతూ సంస్ధానాలు విలీనంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపించిన రాజనీతి, వ్యూహచరురత అంతిమంగా ప్రజలందరూ ఒక్కటిగా జాతీయ బావంతో కలిసిసోవని చూపించారన్నారు. భారతీయ జనతా పార్టీ వల్లభాయ్ పటేల్ లాంటి మనిషి అడుగుజాడల్లో నడుస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఉక్కు సంకల్పంగా స్ఫూర్తిగా తీసుకుని ప్రజాస్వామ్య రక్షణకు పాటుపడాదామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా ఉపాధ్యడు కొండన్నోళ్ల రాంరెడ్డి, ధళిత మోర్చా అధ్యక్షుడు అశోక్, బిజెపి జిల్లా నాయకులు కుంచం శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, బిజెవైఎం మండల ఉపాధ్యక్షుడు అబిలాష్ బాబు, బిజెవైఎం మండల ప్రధాన కార్యదర్శి మధుకర్‌రెడ్డి, బిజెపి టౌన్ అద్యక్షుడు గాజులగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బిజెవైఎం టౌన్ అద్యక్షుడు బండారి శేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సత్యం, శర్వలింగం, చాకలి శ్రీనివాస్, రాజేశ్వం రెడ్డి, బిజెవైఎం నాయకులు పురుషోత్తం రెడ్డి, నవీన్‌రెడ్డి, రఘు, అభిషేర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై టిఎన్‌జిఓస్ నిరసనలు



మేడ్చల్ జిల్లాకలెక్టరేట్ వద్ద బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై నిరసిస్తూ ఆంధోళన వ్యక్తం చేసిన జిల్లా టిఎన్‌జిఓస్ ఉద్యోగులు, పాల్గొని మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రవిప్రకాశ్, పాల్గొన్న తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 31, ప్రభాతవార్త**

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఉద్యోగసంఘాలు అమ్ముడిపోయాయని చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, భేషరతుగా క్షమాపణ చెప్పాలని లేకుంటే టిఎన్‌జిఓస్ ఆంధోళనను ఉధృతం చేస్తామని మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు రవిప్రకాశ్ హెచ్చరించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా టిఎన్‌జిఓస్ నాయకులు, ఉద్యోగులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు పెట్టి నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు రవిప్రకాశ్ మాట్లాడుతూ ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా బండి సంజయ్ మాట్లాడటం తగతదన్నారు. ఉద్యోగ సంఘాలపై ప్రత్యేకంగా టిఎన్‌జిఓస్ యూనియన్ పై విమర్శలు చేయటం దారుణమని, భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో టిఎన్‌జిఓస్ కీలకంగ పనిచేసిందని, జీవితాలు ఫణంగ పెట్టి త్యాగాలు చేసిన ఘనత చరిత్ర ఉద్యోగసంఘాలకు ఉందన్నారు. రాజకీయాల కోసం ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. క్షమాపణ చెప్పకుంటే నిరసనలు కొనసాగుతాయని, టిఎన్‌జిఓల ఐక్యతను చాటుతామని రవిప్రకాశ్ అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ దిష్టిబొమ్మను కలెక్టరేట్ ముందు టిఎన్‌జిఓస్ నాయకులు దగ్ధం చేసే ప్రయత్నం చేయటంతో కలెక్టరేట్ ప్రాంగణంలో చేయరాదని శామీర్‌పేట సిఐ సుధీర్‌కుమార్ దగ్ధం చేయకుండ అడ్డుకోవటం భగ్నం చేయటంతో వారు విరమించుకున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో టిఎన్‌జిఓస్ కేంద్ర కమిటీ సభ్యులు పి.ఈశ్వర్, కలెక్టరేట్, శామీర్‌పేట, ఐటిఐ, సర్వేల్యాండ్స్, మల్కాజ్‌గిరి, మేడ్చల్, బిసి కార్పోరేషన్, పంచాయతీరాజ్, నాలుగవతరగతి ఉద్యోగుల యూనిట్స్ ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులు జేమ్స్, హరి, రవీందర్, రజిని, పద్మ, మారుతి, జెర్మియాస్, శశికుమార్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ యూనియన్ మహాసభలను విజయవంతం చేయాలి

-అంగన్‌వాడి చేవెళ్ల సెక్టార్ నూతన అధ్యక్షురాలుగా ఉమారాణి ఎన్నిక

-అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత పిలుపు



చేవెళ్ల మండల కేంద్రంలోని చేవెళ్ల అంగన్‌వాడి టీచర్ల్ సెక్టార్ సమావేశంతలో చేవెళ్ల సెక్టార్ నూతన అధ్యక్షురాలుగా ఉమారాణిని ఎన్నుకున్న అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత

**చేవెళ్ళ, అక్టోబర్ 31, ప్రభాతవార్త**

ఈ నెల 18,19వతేదిల్లో తుక్కుగూడలో జరిగే అంగన్‌వాడి యూనియన్ మహాసభలను విజయవంతం చేయాలని అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత పిలుపునిచ్చారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని చేవెళ్ల అంగన్‌వాడి టీచర్ల్ సెక్టార్ సమావేశం నిర్వహించారు. అనంతరం చేవెళ్ల సెక్టార్ నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ వ్యవస్దను నిర్వీర్యం చేయడం కోసం అనేక ప్రయత్నాలు చేసిందన్నారు. అంగన్‌వాడి యూనియర్ సిఐటియు అద్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో దేశ రాజదాని డీల్లీ నగరంలో పెద్ద ఎత్తున అందోళన పోరాటాలు చేశామన్నారు. అంగన్‌వాడిలను ఎప్పుడైన ప్రభుత్వం నిర్వీర్యం చేయవచ్చని, అంగన్‌వాడిలకు కనీసం వేతనం 26,000 ఇచ్చే పోరాటం చేయాలన్నారు. చేవెళ్ళ సెక్టార్ నూతన అద్యక్షురాలుగా ఉమారాణి, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ, ఉపాధ్యక్షురాలుగా అనందమ్మ, సక్కయమ్మ, సహయ కార్యదర్శులుగా స్వప్న, అంజమ్మలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, జిల్లా సహయ కార్యదర్శి చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్ తదితరులు పాల్గోన్నారు.

### రాహుల్ గాంధీ బస చేసే స్థలాన్ని పరిశీలించిన మెదక్ డీఎస్పీ సైదులు

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర నవంబర్ 6వ తేదీన పెద్దశంకరంపేట మండలంలోకి ప్రవేశిస్తుంది. ఈ క్రమంలో కమలాపూర్ వద్ద మధ్యాహ్నం ఆయన బస చేసే స్థలాన్ని మెదక్ డీఎస్పీ సైదులు సోమవారం పరిశీలించారు. ప్రధాన రహదారిగుండా భారత్ జోడో యాత్ర కొనసాగనున్న రూట్ మ్యాప్‌ను ఆయన ఈ సందర్భంగా పరిశీలించారు. రాహుల్ గాంధీ బస ఏర్పాట్లపై టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్య క్రమంలో అల్లాదుర్గం సీఐ జార్జ్, ఎస్ఐ బాలరాజ్, యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్, జహంగీర్, భాను, విజయ్ ఉన్నారు.

### తుర్కవాని కుంట సుందరీకరణ పనులు ప్రారంభం

**శివ్వంపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఏదుల్లాపూర్ గ్రామ శివారులో ఉన్న తుర్కవానికుంట పనులను దత్తత తీసుకున్న సేవా గళ్ ఫౌండేషన్ సంస్థ, ఏదుల్లాపూర్ సర్పంచి కల్లూరి కీర్తన హనుమంత రావు, సేవాగళ్ ఫౌండేషన్ ఇంజనీర్ వెంకటేష్, సంస్థ ఇంజనీర్ లావణ్యలు సోమవారం తుర్కవాని కుంటను సందర్శించి కట్ట సుందరీకరణ పనులను ప్రారంభించారు. సేవాగళ్ ఫౌండేషన్, స్థానిక గ్రామ పంచాయితీ పరస్పర సహకారంతో ఈ చెరువు కట్ట రోడ్డును ఇరువైపులా రాతి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. అదేవిధంగా పాదచారుల చెరువు కట్టపై సులభంగా నడుచుకుంటూ వెళ్లేందుకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. అలాగే కట్ట కింది భాగంలో ఆకుపచ్చ గడ్డితో పేర్చి కట్టను అధునాతనంగా తీర్చిదిద్దేందుకు పనులు మదలు పెట్టారు. ఈ సందర్భంగా కేహెచ్ఆర్ ట్రస్టు చైర్మన్ కల్లూరి హనుమంతరావు మాట్లాడుతూ తుర్కవాని కుంటను మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామన్నారు. భవిష్యత్తులో దీనిని ఒక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడం కోసం తన శక్తి మేరకు కృషి చేస్తానని కల్లూరి హనుమంతరావు అంటున్నారు.

### వినియోగదారులకు నమ్మకం, సంరక్షణ కల్పించడమే లక్ష్యం

శామీర్‌పేట అక్టోబర్31, ప్రభాతవార్త : అతిపెద్ద ఎడిబుల్ అయిల్ బ్రాండ్ తన తాజా మార్కెటింగ్ ప్రచారం మెక్స్ యూర్ ఫుడ్ స్పెషల్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. బ్రాండ్ యొక్క ప్రధాన విలువలైన స్వచ్ఛత, నమ్మకం సంరక్షణ నిజాయితీని పునరుద్ఘాటించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఎంకె అగ్రోటెక్ గ్రూప్‌లో భాగమైన సన్‌ప్యూర్, తన బ్రాండ్ అంబాసీడర్‌గా సోనూ సూద్‌ను నియమించుకుంది. పలు రాష్ట్రలో ఉన్న కస్టమర్‌తో బ్రాండ్ డెవలప్ చేసిన సంబంధాన్ని మరింత బలోపేతం చేయడానికి చూస్తుంది. మేనేజర్ గోకరణ్ పవార్ సింగ్ మాట్లాడుతూ...సన్‌ప్యూర్ సన్‌ప్లవర్ ఆయిల్‌తో స్వచ్ఛతను ప్రతి ఇంటికి చేర్చడమే లక్ష్యం పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

### ప్రవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి :సిపిఎం డిమాండ్

**నర్సాపూర్, అక్టోబర్ 31, ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఉచితం గా సీట్లు ఇవ్వాల్సి ఉండగా, నర్సాపూర్ ప్రైవైటు పాఠశాలలో అమలు కావడం లేదన్నారు. ఎన్ని బస్‌లుండాలి, ఫిట్‌నెస్, నంబర్ ప్లేట్స్ లేకుండా నడుపుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ఆయన ప్రశ్నించారు. నిబంధ నలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని కడారి నాగరాజు హెచ్చరించారు.

### బివిఆర్ఐటి విద్యార్థులకు మంచి భవిష్యత్

**నర్సాపూర్, అక్టోబర్ 31, ప్రభాతవార్త:** బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని విష్ణు విద్యాసంస్థల చైర్మన్ కె.వి.విష్ణురాజు పేర్కొన్నారు. నర్సాపూర్ సమీపంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు తల్లిదండ్రులకు సోమవారం పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విష్ణురాజు మాట్లాడుతూ మారుమూల ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో నర్సాపూర్‌లో బివిరాజు ఇంజనీరింగ్ కళాశాలను స్వర్గీయ బివిరాజు స్థాపించారన్నారు. అనంతరం కళాశాలలో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు ఆయన అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విష్ణు విద్యాసంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజ్‌గోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మిప్రసాద్, మేనేజర్ బాపిరాజు, లెక్చరర్‌లు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ప్రయాణికుడికి సహాయపడే విధంగా రూపకరణ

నాగారం అక్టోబర్31, ప్రభాతవార్త : ఆన్‌లైన్ బస్ టికెటింగ్ వేదిక అయిన రెడ్‌బస్ తనదైన ఒక రకం డిజిటల్ బస్ బోర్డింగ్ సౌకర్యంగా పిలువబడే ఆర్‌జోన్ యొక్క విస్తరణను తన ప్రముఖ ప్రాజెక్టు యొక్క దశ-2లో భాగంగా నగరంలోని 137 కొత్త స్థానాలలో ప్రారంభిస్తున్నట్లుగా ప్రకటించింది. ఒక ఆర్‌జోన్ అనేది, ప్రయాణికులు తాము బస్ ఎక్క వలసిన కచ్చితమైన చోటును గుర్తించడానికి మరియు ఎటువంటి అనిశ్చిత లేదా ఉత్కంఠ లేకుండా బస్ ఎక్కడానికి సహాయపడేలా రెడ్‌బస్ యాప్ అతనికి సూచిస్తుందని వెల్లడించింది.

### అంబేద్కర్, వివేకానంద విగ్రహాలకు భూమి పూజ



**మొయినాబాద్ 31, ప్రభాతవార్త :**

మొయినాబాద్ మండలంలోని చిల్కూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో అవరణలో డా.బిఆర్ అంబేద్కర్ మరియు స్వామి వివేకానంద విగ్రహాలను ప్రతిష్టాపన కొరకు చిల్కూర్ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బ్యాగరి రాజు ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పాఠశాల ప్రిన్సిపల్ శౌరిరాజ్ హజరై మాట్లాడుతూ భారతదేశానికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే ప్రతి పేదవాడికి కనీసం విద్య, వైద్యం, కనీస ఉపాధి అనేది అంబేద్కర్ గారు కోరుకున్న వాటిలో ముఖ్యమైనవని అన్నారు, అయన ఆశయం, సిద్ధాంతం తోనే గురుకులం లాంటి ఎన్నో పాఠశాలలను ప్రభుత్వాలు ఏర్పాటుచేసి ఉచితంగా విద్యను అందిస్తున్నాయన్నారు, దేశంలోని పేదలకు సమన్యాయం, జరుగాలని, పురుషులతో సమానంగా స్త్రీలకు హక్కులు కల్పించాలని భారత రాజ్యాంగంలో పొందపరిచారన్నారు, అంబేద్కర్ విగ్రహన్ని చూసిన్నపుడు అంబేద్కర్‌లాంటి గొప్ప చదువులు చదువాలని విద్యార్దులకు ఆదర్శంగా ఉంటుందని విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యాక్రమం ఏర్పాటుచేసామన్నారు, ఈ కార్యక్రమంలో ఆల్‌ఇండియా అంబేద్కర్ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యాదర్శి పంబల రవిందర్, యూమన్‌రైట్స్ అధ్యక్షులు మాల స్వామి, పేరెంట్స్ కమటి రంరెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రామగల గిరిబాబు, చిల్కూర్ పేరెంట్స్ కమిటి ఉపాధ్యాక్షులు పామేన నరసింహులు, ప్రధాన కార్యదర్శి సత్యం, సహయ కార్యదర్శి రాచమల్ల రాజ్‌కుమార్, కార్యవర్గ సుభ్యులు కృష్ణరావు, యాదగిరి, వెంకటేష్, సత్తయ్య, బాబురావు, పూష్పరాజ్ పాల్గోన్నారు,

### మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి



దేవరయాంజాల్‌లో ఇందిరాగాంధీ విగ్రహంకు పూలమాల వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్‌నాయకులు

**శామీర్‌పేట, అక్టోబరు 31, ప్రభాతవార్త**

దేవరయాంజాల్‌లో మాజీ ప్రధాని, స్వర్గీయ ఇందిరాగాంధీ 38వ వర్ధంతి సందర్భంగ ఇందిరాగాంధీ విగ్రహంకు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సోమవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని దేవరయాంజాల్‌లో మున్సిపాల్టీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్వర్గీయ ఇందిరాగాంధీ సేవలను పలువురు నాయకులు స్మరించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాము, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, బిసిసెల్ అధ్యక్షులు పి.లక్ష్మినారాయణ, సేవాదళ్ అధ్యక్షులు కొండల్‌రెడ్డి, నాయకులు మురళీగౌడ్, పాండు, నారాయణ, దుర్గయ్య, బిక్షపతి, ఆదినారాయణ, మల్లేశ్‌గౌడ్, జగన్, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మండల పరిషత్ కార్యాలయంలో సర్దార్ వల్లబ్‌బాయి పటేల్‌కు నివాళులు



మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్దార్‌వల్లబ్‌బాయి పటేల్ జయంతి సందర్భంగ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎంపిపి వి.హారికమురళీగౌడ్, ఇన్‌చార్జి ఎంపిడిఓ బి.రవి, పాల్గొన్న తదితరులు

**శామీర్‌పేట, అక్టోబరు 31, ప్రభాతవార్త**

మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్దార్ వల్లబ్‌బాయిపటేల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్దార్‌వల్లబ్‌బాయిపటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వి.హారికమురళీగౌడ్, ఇన్‌చార్జి ఎంపిడిఓ బి.రవి, పలువురు అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి చేయాలని వార్డు ప్రజల వినతి



వినతి పత్రం అందజేస్తున్న మూడు గ్రామ 3వ వార్డు నాయకులు

**మేడ్చల్, అక్టోబర్ 31. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామ 3వ వార్డులో అభివృద్ది పనులు చేపట్టాలని కోరుతూ గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, ఉప సర్పంచ్ వెంకటేష్‌కు వార్డు నేతలు వినతి పత్రం అందజేశారు. వార్డులో ప్రధాన సమస్యలుగా ఉన్న సిసి రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి పనులు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నేతలు గడ్డం భాస్కర్, బక్క నాగరాజు, గడ్డం బాబు, గడ్డం ఎల్లమేశ్వర్, యాస మదుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల వేతన సవరణ గేట్ మీటింగ్



కార్మికుల వేతన ఒప్పంద పత్రంతో కంపనీ యూనియన్ అధ్యక్షుడు రాజశేఖరెడ్డి, యూనియన్ నాయకులు

**మేడ్చల్, అక్టోబర్ 31. ప్రభాతవార్త :** కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా శక్తివంచన లేకుండా పాటుపడుతున్నామని సనోఫీహెల్త్‌కేర్ కంపనీ కార్మిక యూనియన్ అధ్యక్షుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని సనోఫి హెల్త్‌కేర్ కంపనీలో కార్మికుల వేతన సవరణ ఒప్పందం కోసం సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు టీఆర్ఎస్‌కేవీ యూనియన్ ఎల్లవేళలా అండదండలుగా ఉంటూ వారి బాగోగుల గురించి పని చేస్తున్నదని అన్నారు. కార్మికుల శ్రేయస్సు కోసం సనోఫి కంపనీ యాజమాన్యంతో పలు దఫాలుగా చర్చలు జరిపి కార్మికుల వేతన ఒప్పందం కుదిర్చామని తెలిపారు. అందులో భాగంగా కార్మికులకు రూ 12300లు ఒక స్లాబుగా, రూ9550లు మరో స్లాబుగా వేతనాలు పెంచడానికి యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్‌కేవీ యూనియన్ జిల్లా అధ్య క్షుడు ప్రభాకర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు రాజశేఖర్, శ్రీరాంరెడ్డి, మచ్చేందర్, సురేష్ గౌడ్, శ్రీనివాసులు, బలరాం, పరమేష్, నాగరాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, షఫీ, సారిక, శ్రావణి, కార్మికులు పాల్గొన్నారు.

### ఎస్ఆర్ఓ సహదేవ్‌కు రియల్టర్స్ సత్కారం



ఘట్‌కేసర్ ఎస్ఆర్ఓ సహదేవ్‌ను సన్మానిస్తున్న రియల్టర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 31, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సహదేవ్‌ను తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా నాయకులు సన్మానించారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు టి.మహేశ్‌తో పాటు నాయకులు సోమవారం ఎస్ఆర్ఓను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలదండలతో సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షులు వి.భాస్కర్‌రెడ్డి, డి.రవికుమార్, బి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చరిత్ర సృష్టించనున్న రాహుల్‌గాంధీ జోడో యాత్ర

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** దేశాన్ని ఏకం చేసేందుకు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తెలంగాణలో చరిత్ర సృష్టి స్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జోడోయాత్రపై నిర్వ హించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా ఈ యాత్ర సాగుతుందన్నారు. ఎవ రైనా యాత్రలో పాల్గొనవచ్చని తెలిపారు. నవంబర్ 6వ తేదీన నారాయణ ఖేడ్ నియోజకవర్గంలోకి పెద్దశంకరంపేట మండల పరిధిలోని కోలపల్లి నుండి కల్హేర్ మండల పరిధిలోని మాసన్‌పల్లి మీదుగా ఈ యాత్ర కొన సాగుతుందన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కార్యకర్తలు, ప్రజలు ఈ యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి, కాంగ్రెస్ నాయకులు రాయిని మధుసూదన్, జనార్ధన్, జైహింద్‌రెడ్డి, గంగారెడ్డి, జైపాల్‌గౌడ్, మహిపాల్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### పౌర హక్కులపై అవగాహన సదస్సు

**మర్కుక్, అక్టోబర్ 31 (ప్రభాతవార్త):**

పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల పరిధి లోని నర్సన్నపేటలో సర్పంచ్ మా ధవిరాజిరెడ్డి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కులపై అందరూ అవగాహన కలిగివుండాలని సూచిం చారు. గ్రామాల్లో కులాలకతీతంగా సమానత్వంతో ఉండాలని పేర్కొ న్నారు. కార్యక్రమంలో మర్కుక్ ఏఎస్ఐ, కార్యదర్శి శ్వేత, ఆర్ఐ నర్సింలు, పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

That the one Sutharam Srinivas S/o Suryaprakash A/a 50, Occ: Business, R/No 18-7-846/52, O/s Gowlipura, Near Kamala, Hyderabad, Telangana State, is the absolute owner of the agriculture land bearing No. Sy.No. 60, Adm Ac-1-06 Gts, situated at Dubbacherla Revenue Village, Maheshwaram Mandalam, Ranga Reddy District, having purchase the said property through Regd, Sale Deed No. 575/2005. That on 23.10 2022 while he was travelling by his bike from Hyderabad to Nagaram to meet his friend, he lost his original Document No. 575/2005 and his purse.

That the said Sutharam Srinivas have lost his Original Document No. 575/2005, of agriculture land Ac. 1-06 Gts., situated at Dubbacherla (V), Maheshwaram (M), Ranga

**V. RANJIT CHARAN KUMAR**
ADVOCATE
OFF: FLAT NO: 414,
B' BLOCK SANTOSH ARCADE Apts
H.No: 23-70/7/B.
METATI NAGAR
DSNR, Hyd- 60
**M: 8328676204**

## ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న సర్పంచ్ కుర్వ జయమ్మసుదర్శన్

**షాబాద్, అక్టోబర్ 31, ప్రభాతవార్త :**
ప్రతి ఒక్కరు గ్రామాభివృద్ధికి పాటుపడాలని ముద్దెంగూడ సర్పంచ్ కుర్వ జయమ్మసుదర్శన్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులతో కలిసి గ్రామ సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ....ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తానని తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శోభ, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

## భారత్ జోడో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



భారత్ జోడో యాత్రలో పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు

**యాచారం, అక్టోబర్ 31 ప్రభాతవార్త**
కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా సోమవారం తెలంగాణ రాష్ట్రంలోని షాద్‌నగర్ నుండి శంషాబాద్ వరకు నిర్వహించిన పాద యాత్రలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు పాద యాత్రలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్కు నర్సింహ, ప్రధాన కార్యదర్శి వరికుప్పల సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు గులాం అక్బర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గౌరారం వెంకటరెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు లిక్కి పాండురంగారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిన్నోళ్ల మల్లేష్, నడ్డి విజయ్ కుమార్, చీర శేఖర్, సాయిబాబు, వరికుప్పల యాదయ్య, రాజుకుమార్, ఎల్లయ్య, వెంకటేష్, పాండు, ఈదయ్య, సత్యం, ప్రవీణ్‌రెడ్డి, కొండల్, ప్రభాకర్, జీవన్, విక్రమ్, మహిపాల్‌రెడ్డి, దార నర్సింహ, ఆ యా గ్రామాల యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి : మధుసూదన్‌రెడ్డి

**యాచారం, అక్టోబర్ 31 ప్రభాతవార్త**
నవంబర్ 2న నిర్వహించే రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి ధాన్యం కల్లాల్లోకి వచ్చినా నేటికీ ప్రభుత్వం మాత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని ఆరోపించారు. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేయాలని కోరారు. ఈ నెల 2న మండల పరిధిలోని గునగల్‌లో నిర్వహించే రైతు సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం మహాసభల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ఉపాధి హామీ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి : సర్పంచ్ సంతోష రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ కంబాలపల్లి సంతోష రమేష్

**యాచారం, అక్టోబర్ 31 ప్రభాతవార్త**
ఉపాధి హామీ చట్టాన్ని పాలకులు, అధికారులు సమర్ధవంతంగా అమలు చేయాలని సర్పంచ్ కంబాలపల్లి సంతోష రమేష్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలనుకునే రైతులకు ధరఖాస్తులు అందించాలన్నారు. రైతు పొలంలో లెవలింగ్, కందకాలు తీయడం, పొదలు వంటి పనులకు ముందుగా గ్రామపంచాయితీ నుండి తీర్మానం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులు చేసేటప్పుడు పని ప్రదేశాలకు వెళ్లగానే మస్టర్‌లో హాజరు వేసి సంతకాలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ప్రజలకు ఎంతో జీవనోపాధి కల్పిస్తుందన్నారు. గ్రామంలో క్షేత్ర సహాయకుల రాజీనామాతో గ్రామ పంచాయితీ నుండి పిడికి అతి త్వరలోనే ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరుతూ వినతిపత్రం అందించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మాణిక్యం, పంచాయితీ కార్యదర్శి మమత, సీనియర్ మేట్ వెంకటేష్ కిషన్, కారోబార్ గణేష్, కంబాలపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంకుశాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు వినతి

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 31, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ నాయకులు సోమవారం ఆర్టీసీ డిపో అధికారులకు విజ్ఞాపన పత్రం అందజేసినట్లు తెలిపారు. గతంలో ఉప్పల్ డిపో అధికారులు ఉదయం సాయంత్రం వేళల్లో గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడిపేవారని ఇటీవల వాటిని రద్దుచేసినట్లు తెలిపారు. బస్సు సౌకర్యం రద్దు చేయడంతో ఉద్యోగ, వ్యాపారస్తులు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రద్దు చేసిన ఆర్టీసీ బస్సులను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ డిపో మేనేజర్‌కు గ్రామ నాయకులు పిట్టల రాజు, మేడబోయిన రాజు, వార్డు సభ్యులు గంగీ శంకర్, బత్తుల కృష్ణా గౌడ్ తదితరులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.



.అంకుశాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ పునరుద్ధరించాలని కోరుతూ ఆర్టీసీ డిపో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామ నాయకులు.

# షాద్‌నగర్‌లో ఘనంగా సదర్ ఉత్సవాలు

- యాదవులకు ప్రత్యేకమైన పండగ...
- 22వ వార్డు కౌన్సిలర్ సరితాయాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- ముఖ్యఅతిథిగా హాజరు కానున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్.



సదర్ ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న యాదవ సంఘం అధ్యక్షుడు



సదర్ వేడుకలకు రానున్న దున్నరాజు

**షాద్‌నగర్, అక్టోబర్ 31, (ప్రభాతవార్త) :**
"సదర్" అంటే హైదరాబాదీ వ్యవహారికం ప్రకారం ప్రధానమైదని అని అర్థం. యాదవులకు ఒక ప్రత్యేకమైన ప్రధాన ఉత్సవంగా సదర్‌ను ఎంతో వైభవంగా నిర్వహించుకుంటారు. ముఖ్యంగా అలంకరించిన దున్నపోతులతో యువకులు కుస్తీ పట్టడం ఈ ఉత్సవం ప్రత్యేక విశేషం.... ఈ సదర్ ఉత్సవాలను ఒక్కసారి పరిశీలిస్తే...

**యాదవులకు ప్రత్యేకమైనది సదర్.**
పురాణాలు, ఇతిహాసాల ప్రకారం యాదవ కులస్తులు శ్రీకృష్ణుని వారసులుగా ఉన్నారు. శ్రీకృష్ణుడు ఆల మందలను పెంచి పోషించడంతో మానవ జీవితంలోనూ కొన్ని సామాజిక తరగతులకు, కులాలకు పశువులను పెంచడం ఒక వృత్తిగా మారింది. యాదవ కులస్తులూ పశుసంపదను పెద్ద ఎత్తున కలిగి ఉంటారు. తమ వృత్తి నుంచి ఆవిర్భవించిన ఉత్సవమే నేడు సదర్ ఉత్సవాలుగా అందరి ఆదరణ పొందుతుంది.

**పెరుగుతున్న ఆదరణ**
సదర్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు క్రమంగా యాదవులతో పాటు ఇతర వర్గాలకు చెందిన వారు సహితం ఉత్సహం చూపిస్తున్నారు. సదర్ ఉత్సవాలు నిర్వహించడానికి యాదవ యువకులు అమితాసక్తి చూపిస్తుండటంతో ప్రతి ఏటా ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇదీ వరకు ఒక్క హైదరాబాద్ నగరానికి మాత్రమే పరిమితమైన సదర్ ఉత్సవాలు నేడు రాష్ట్రంలో అనేక పట్టణాలకు, గ్రామాలకు విస్తరిస్తున్నాయి. ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి యాదవ కులాస్థులు ఇతర రాష్ట్రాల నుంచి సహితం దున్నలను తీసుకువచ్చి చూపరులకు కనువిందు చేయిస్తున్నారు. మహిళలు, చిన్నారులు ఈ ఉత్సవాల్లో పాల్గొనడానికి ఎంతో ఇష్టంతో వస్తుంటారు.

**షాద్‌నగర్‌లో వైభవంగా సదర్ వేడుకలు...**
గత కొన్ని సంవత్సరాలుగా షాద్‌నగర్‌లో యాదవ సదర్ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని 22వ వార్డుకు చెందిన టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నడికూడ యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఎంతో వైభవంగా నిర్వహించే సదర్ ఉత్సవాలను ఈ ఏడాది సహితం ఘనంగా నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రేపు 22వవార్డులో నిర్వహించే సదర్ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, యాదవ సంఘాలకు చెందిన పెద్దలు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. ఈ సదర్ ఉత్సవాలకు చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు హాజరై ఎంతో వైభవంగా వేడుకలను జరుపుకోవడం విశేషం. రేపు జరిగే ఈ సదర్ ఉత్సవాలకు అన్ని వర్గాల వారు హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడానికి ప్రత్యేకమైన ఏర్పాట్లును చేశారు. ఉత్సవాల్లో సందడి చేయడానికి హార్యానాకు చెందిన దున్నపోతులను తీసుకురావడంతో అవి ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. వీటితో కూస్తీ పట్టడానికి యాదవ కులానికి చెందిన యువకులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. ఈ సదర్ ఉత్సవాలను ప్రధానంగా దీపావళి పండుగ అనంతరం రెండు మూడు రోజులకు ఘనంగా నిర్వహిస్తారు.

## విద్యార్థులకు దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 31,(ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినయోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ అరుణ, భాస్కర్, అరుణ్, ఉపాధ్యాయులు శివాజి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బాధితులందరికీ అండగా ఉంటా

-మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజునాయక్



బాధితునికి రాజునాయక్ తరపున ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**యాచారం, అక్టోబర్ 31 ప్రభాతవార్త**
మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా అందుబాటులో ఉండి ఆదకుంటానని గ్రామ మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజునాయక్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన మూలి మల్లమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో భాదపడుతూ గత రెండు మూడు రోజుల క్రితం మృతి చెందడంతో విషయాన్ని తెలుసుకున్న ఆయన ఖర్చుల నిమిత్తం భాదిత కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పేద ప్రజలకు ఎటువంటి ఆపద వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న ఎంపిపి కొప్పు సుకన్యభాష

**యాచారం, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** భారత మాజీ ఉప ప్రధాని సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎంపిపి కొప్పు సుకన్య భాషా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించనప్పుడే పాఠశాలకు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అవుశాపూర్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:**
ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ సమాఖ్యతలో అందరు పాలుపంచుకోవాలని గ్రామ సర్పంచ్ ఏనుగు కావేరిమశ్చేందర్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా సోమవారం రోజున జాతీయ సమైక్యత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో గ్రామ సర్పంచ్ ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. దేశ సమైక్యత కొరకు అందరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ ఏలుసాని అయిలయ్య యాదవ్, వార్డు సభ్యులు బొడిగే శ్రీనివాస్ గౌడ్, కె. మల్లేశ్, గ్రామ నాయకులు కంచర్ల వెంకట్ రెడ్డి, వామన్ రెడ్డి, అనురాగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవుశాపూర్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యత ర్యాలీ ప్రారంభోత్సవం సందర్భంగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న సర్పంచ్ వై. కావేరి.

## మునుగోడులో టీఆర్ఎస్ గెలుపు ఖాయం



**తలకొండపల్లి అక్టోబర్31,ప్రభాతవార్త :** మునుగోడ ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ గెలుపు ఖాయమని టిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.సోమవారం మునుగొడు ఉప ఎన్నిక సందర్భంగా రేవల్లి,తుమ్మలపల్లి గ్రామాలలో టిఆర్ఎస్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ ఇంటింట ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను వివరించి బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఈవిఎంలను చూపిస్తూ కోరారు.కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### మనోవేదనకు గురై వ్యక్తి ఆత్మహత్య

**తలకొండపల్లి అక్టోబర్31,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలో మనోవేదనకు గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేలుగులోకి వచ్చింది.అందుకు సంబంధించిన కుటుంబ సభ్యులు,పోలీసుల కథనం ప్రకారం తలకొండపల్లి మండల కేంద్రంలోని మారమని షమంత ,నరసింహ కుమారుడు మారమని శివ (21) అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఊరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.గత కొంతకాలంగా శివ ఎవరితో మాట్లాడకుండా మానసిక వేదన గురి అయ్యేవాడు అని కుటుంబ సభ్యులు తెలిపారు.ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

# ప్రతి ఒక్కరూ ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలి



చేవెళ్ల మండల కేంద్రంలోని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలు వెసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డిసిసి మాజీ అద్యక్షుడు పడాల వెంకట్‌స్వామి

**చేవెళ్ళ మండలంలో**

**చేవెళ్ళ, అక్టోబర్ 31,ప్రభాతవార్త :** దేశ ప్రయోజనాల కోసం తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి తన ప్రాణాలను సైతం అర్పించిన ఘనత దివంగత ప్రధాని మహనీయురాలు ఇందిర గాంధీకే దక్కిందని ఉమ్మడి అంధ్ర ప్రదేష్ మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ వెల్లడి అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అమె విగ్రహానికి పూల మాలలు వెసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అంధ్ర ప్రదేష్ మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ...బ్యాకుంలను జాతీయం చేసి ప్రతి సామాన్యుడికి సైతం బ్యాంకు సేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత ఇందిరా గాంధీకి దక్కిందన్నారు. 1971 సంవత్సరంలో భారతరత్న పురస్కారాన్ని పోందిన మొట్టమొదటి మహిళ కూడ ఇందిరా గాంధీనేనన్నారు. పేద ప్రజలకు భూములు పంపిణీ చేసిన ఘనత కూడ ఇందిరాగాంధీకి దక్కుతుందన్నారు.అపరేషన్ బ్లూ స్టార్ చర్యకు అదేశించి ఉగ్రవాదాన్ని అణచి వేసిన వ్యక్తి కూడ ఇందిరాగాందీనేనన్నారు.భారత చరిత్రలో హత్యకు గురైన మొట్టమొదటి భారత ప్రధాని కూడా ఇందిరా గాంధీనేన్నారు.అంతరిక్షంలో ఉన్న వ్యోమగామితో మాట్లాడిన మొట్టమొదటి భారత ప్రధానిమంత్రి ఇందిరాగాంధీ అని కోనియాడారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అద్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, పిసిసి కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి,చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రేస్ పార్టీ నాయకులు సున్నపు వసంతం, మండల పార్టీ అద్యక్షుడు వీరేందర్‌రెడ్డి,మాజీ పిసిసి సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ జిల్లా సర్పంచు సంఘం అద్యక్షుడు మదుసూదన్‌గుప్తా, యువజన కాంగ్రేస్ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్,ఎంపిటిసి రాములు,ముడిమ్యాల శ్రీనివాస్, ఆగిరెడ్డి, సీనియర్ నాయకులు పెంటయ్యగౌడ్, సత్యం,మాజీ సర్పంచ్ బాలయ్య, చేవెళ్ల ఉప సర్పంచ్ గంగియాదయ్య తదితరులు పాల్గోన్నారు.



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**షాబాద్ మండలంలో**

**షాబాద్, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య తెలిపారు. సోమవారం ఇంధిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని బోడంపహాడ్‌లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... దేశ ప్రయోజనాల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టిన ఘనత ఇందిరమ్మదేనన్నారు. ప్రతి ఒక్కరు ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకో వాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు తమ్మలి రవీందర్, శేఖర్, చిన్నయ్య, గౌరీశ్వర్, నవీన్, జంగయ్య, బందయ్య, రాజు, యాదగిరి, సాయి, అంజయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు.



ఇందిరానగర్‌లో ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**శంషాబాద్ మండలంలో**

**శంషాబాద్ అక్టోబర్31,ప్రభాతవార్త :** దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు.ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఊటుపల్లి ఇందిరానగర్‌లోని ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజయ్ యాదవ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ...దేశంలో అనేక సంస్కరణలకు ఇందిరాగాంధీ శ్రీకారం చుట్టారని ఆమె చేసిన బ్యాంకుల జాతీయ కరణ పేదలకు భూముల పంపిణీ ఇళ్ల స్థలాల పంపిణీ ఉద్యమంలో సాగయని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైలారం సులోచన,జల్లపల్లి నరేందర్,కిష్టయ్య,పిట్టల యాదయ్య ముదిరాజ్, మాచర్ల అశోక్,ఎంఎ గని,పరమేష్,జహంగీర్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు



ఖుదాబక్షపల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ రవీందర్‌యాదవ్.

**మునుగోడు ఎన్నికల ప్రచారం కేశంపేట ఎంపీపీ**

**షాద్‌నగర్, అక్టోబర్ 31, (ప్రభాతవార్త) :** మునుగోడు ఎన్నికలు సమీపిస్తుండటంతో టీఆర్ఎస్ పార్టీ జోరును పెంచింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు మేరకు షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండల ఎంపీపీ రవీందర్‌యాదవ్ సోమవారం మునుగోడు నియోజకవర్గంలోని మర్రిగూడ మండలం ఖుదాబక్షపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు టీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. దేశంలో బీజేపీ పార్టీ నియంత పాలనను కొనసాగిస్తుందని అన్నారు. బీజేపీ పాలనను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. ప్రచారం కేశంపేట మండల టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



ఓటర్లకు కారు గుర్తును చూపిస్తున్న జడ్పీటీసీ విశాల శ్రావణ్‌రెడ్డి.

**ప్రచారంలో కేశంపేట జడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి.**
మునుగోడు ఉప ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేయాలని కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ఓటర్లకు సూచిస్తూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. సోమవారం కేటీఆర్ ఇంఛార్జీగా ఉన్న గట్టుప్పల్ గ్రామంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపు మేరకు కేశంపేట జడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామంలో ప్రతి గడపకు టీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ఆమె ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



అజిలాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపిపి కొప్పు సుకన్య భాషా

**మునుగోడులో ప్రచారంలో ఎంపిపి కొప్పు సుకన్య భాషా**

**యాచారం, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** ఈ నెల 3న జరగనున్న మునుగోడు నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయం తథ్యమని ఎంపిపి కొప్పు సుకన్య భాషా పేర్కొన్నారు. మునుగోడు ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా మండల బిజెపి నాయకులతో కలిసి ఆమె రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మర్రిగూడ మండలంలోని అజిలాపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తన పదవిని సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన రాజగోపాల్‌రెడ్డిని నియోజకవర్గ ప్రజలు ఆశీర ్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

